బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

■ నిజాంపేట, డిసెంబర్ 18 : మండలంలోని కల్వకుంట గ్రామంలో బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 8న మృతి చెందాడు. కాగా, సోమవారం కల్వకుంటలో నిర్వహించిన దశదిన కర్మకు మాజీ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత సోలిపేట సతీశ్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులు కొత్త కిషన్‌రెడ్డి, జన్నారెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఎమ్మెల్యే సునీతారెడ్డితో రామంతాపూర్‌తండాకు చెందిన నేతలు

■ వెల్దుర్తి, డిసెంబర్ 18 : ఎమ్మెల్యే సునీతారెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో బీఆర్ఎస్ నాయకులు కలిశారు. బీఆర్ఎస్ మాసాయిపేట మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ గోపినాయక్‌తోపాటు రామంతాపూర్‌తండా నాయకులు, గిరిజనులు ఎమ్మెల్యే సునీతారెడ్డిని సన్మానించారు. తండాలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

■ మెదక్, (నమస్తే తెలంగాణ)/ మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 18 : చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయుడు వెంకటకృష్ణారెడ్డి విధులు నిర్వహించకున్నా నాలుగు నెలలుగా జీతం తీసుకున్నాడని, జీతం పొందడానికి సహకరించిన హెచ్ఎం ప్రణీద్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్‌గౌడ్, ప్రధానకార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని సోమవారం డీఈవో రాధాకిషన్‌కు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య, ప్రధా నకార్యదర్శి వెంకట్రాంరెడ్డి, టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, టీఎస్‌యూటీఎఫ్ జనరల్ సెక్రటరీ పద్మారావు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత

■ నిజాంపేట, డిసెంబర్ 18 : మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. నందిగామ గ్రామానికి చెందిన పాపయ్యగారి బాబు (30) గల్ఫ్‌లో ఐదురోజుల క్రితం అక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు ఎంపీటీసీ సురేశ్, మహేందర్, చారి తదితరులు సోమవారం మృతుడు బాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.16వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు స్వామి, తిరుపతి, రమేశ్, శివగౌడ్, కుమార్, కిరణ్, రమేశ్, కనకరాజు, నాగరాజు, సాయి, సురేశ్, జలమంద రాజు ఉన్నారు.

ఏడుపాయల్లో భక్తుడు మృతి

■ పాపన్నపేట, డిసెంబర్ 18: ఏడుపాయల ఆలయానికి వచ్చిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒక భక్తుడు సోమవారం మంజీరా నదిలో మునిగి చనిపోయాడు. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బిడగుప్ప మండలం కర్కకెల్లి గ్రామానికి చెందిన శంకు బస్వరాజ్ (50) తన తల్లి, భార్యాపిల్లలతో కలిసి సోమవారం దుర్గమ్మ దర్శనం కోసం వచ్చాడు. స్నానం చేయడానికి చెక్‌డ్యాం ఆవలి వైపు వెళ్లాడు. నీటిలో దిగగానే ఫిట్స్ వచ్చి నీట మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు వివరించారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

■ శివ్వంపేట, డిసెంబర్ 18 : బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవికాంత్‌రావు తెలిపిన వివరాలు.. పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన గంగనగారి సత్తయ్య (45), బాలవీరయ్యలు ఇద్దరు కలిసి ఈ నెల 17న ఉదయం 11 గంటలకు కాళ్లకల్ వెళ్తున్నామని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లారు. సాయంత్రం ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో గోమారం గ్రామశివారులో బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో సత్తయ్య తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందగా, బాలవీరయ్యకు గాయపడ్డాడు. మృతుడి భార్య యశోద ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవికాంత్‌రావు తెలిపారు.

చదువును నిర్లక్ష్యం చేయొద్దు

■ విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి
■ ప్రతిరోజూ కళాశాలకు రావాలి
■ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు

ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ/ చిన్నశంకరంపేట/ రామాయంపేట/ చేగుంట, డిసెంబర్ 18 : విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చి అధ్యాపకులు చెప్పే పాఠాలు విని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ పిల్లలను కళాశాలలకు పంపే బాధ్యత తల్లిదండ్రులదని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు వస్తే అధ్యాపకులు బోధించే పాఠాలు వింటేనే విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. క్రమశిక్షణతోనే కళాశాలకు వస్తే విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో అధ్యాపకులు మధుసూదన్‌రావు, ముస్తాక్ అహ్మద్, ఫసియొద్దీన్, తిరుపతి, వెంకటేశం, మల్లయ్య, అశోక్, శ్రీనివాస్, శేఖర్, కవిత, రమణ, కృష్ణ పాల్గొన్నారు.

కళాశాలలకు రావాలి : ప్రిన్సిపాల్ నాగేందర్

విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ సూచించారు. చిన్నశంకరంపేట జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు ఇంటివద్ద ప్రత్యేక శ్రద్ధ చూపాలని రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి సూచించారు. ప్రభుత్వ కళాశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించి, సూచనలు చేశారు. తల్లిదండ్రులు ఇంటి వద్ద విద్యార్థులను క్రమశిక్షణతో చదివించాలన్నారు. శ్రద్ధగా చదివితేనే విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ మల్లేశం, అధ్యాపకులు బాబురావు, యాదగిరి, సురేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్, బాలాగౌడ్, మస్తాన్, శ్రీదేవి, బాలప్రకాశ్ ఉన్నారు.

తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి

★ చేగుంట కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమీలారాణి

విద్యార్థుల భవిష్యత్ తల్లిదండ్రులపై ఆధారపడి ఉంటుందని చేగుంట జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమీలారాణి అన్నారు. కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. రానున్న పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. విద్యార్థులు వచ్చే మూడు నెలలు కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని కోరారు. సమావేశంలో అధ్యాపకులు ఫర్జానా, స్వర్ణలత, నీరజ, గ్రేసమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

చేగుంటలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమీలారాణి

చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాగేందర్

రామాయంపేటలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

అధికారులు సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, డిసెంబర్18 : అధికారులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలు పరిష్కరించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సూచించారు. సోమవారం చిన్నశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవినీతి రహిత పాలనను అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, సీడీపీవో స్వరూప, ఎంపీడీవో ప్రవీణ్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయశాఖ మండలాధికారి లక్ష్మీప్రవీణ్, పశువైద్యాధికారి గీతామాలిక, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు, ఈజీఎస్ ఏపీవో వెంకటసాయి, ఐకేపీ ఏపీఎం లక్ష్మీనారాయణ సర్పంచ్ రాజిరెడ్డి, వివిధ శాఖల అధికారులతోపాటు వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెదక్‌లో మహిళ హత్య

మెదక్ అర్బన్, డిసెంబర్ 18 : జిల్లా కేంద్రంలోని పిల్లికోటాల్ కాలనీకి చెందిన మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి సమీపంలోని నీటికుంటలో పడవేసిన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మెదక్ పట్టణం పిల్లికోటాల్ కాలనీలో నాచారం స్వాతి తల్లి మరియమ్మ(41) శనివారం సాయంత్రం బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికిన అచూకీ లభించకపోవడంతో సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం సాయంత్రం పిల్లికోటాల్‌లోని పిల్లికుంట వద్ద స్వాతి చెప్పులు కనిపించాయి. అనుమానంతో కుంటలో గాలించగా మృతదేహం లభించింది. మృతదేహం తలపై గాయం ఉండడంతో స్వాతిని హత్య చేసినట్లుగా భావిస్తున్నట్లు మెదక్ పట్టణ సీఐ తెలిపారు.

సికింద్లాపూర్ దేవస్థానంలో విక్రయాలపై వేలంపాట

శివ్వంపేట, డిసెంబర్ 18 : మండలంలోని సికింద్లాపూర్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో పూజా సామగ్రి విక్రయాలపై ఈ నెల 22న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శశిధర్‌గుప్తా సోమవారం ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు(పసుపు, కుంకుమ, ఆగర్‌బత్తీలు) విక్రయించడానికి ఏడాది కాలానికి టెండర్‌దారులు రూ.50వేలు, లడ్డూ, పులిహోర విక్రయాలకు టెండర్‌దారులు రూ.25వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

సమావేశం వాయిదా

చిన్నశంకరంపేట, డిసెంబర్ 18 : సోమవారం నిర్వహించాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సభ్యుల కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. తిరిగి సమావేశాన్ని నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

■ ఓవరాల్ కరాటే చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న మెదక్ విద్యార్థులు
■ అభినందించిన శిక్షకులు, ఉపాధ్యాయులు

మెదక్ మున్సిపాలిటీ/ చేగుంట/ రామాయంపేట, డిసెంబర్ 18 : విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని కరాటే శిక్షకులు, ఉపాధ్యాయులు సూచించారు. రెంజుకు షోటోకాన్ ఆధ్వర్యంలో సోమవారం మెదక్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీలకు తెలుగు రాష్ట్రాలతోపాటు కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వెయ్యి మంది హాజరైనట్లు రెంజుకి షోటోకాన్ డైరెక్టర్ నగేశ్ తెలిపారు. కరాటే పోటీల్లో మెదక్ పట్టణానికి చెందిన విద్యార్థులు 30 బంగారు, 10 రజత పతకాలు సాధించి ఓవరాల్ కరాటే చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారన్నారు. పోటీల్లో కరాటే మాస్టర్ దినకర్ పాల్గొన్నారు.

- 15 గోల్డ్, 14 సిల్వర్ మెడల్స్ సాధించిన నార్సింగి, చేగుంట మండలాల విద్యార్థులు

మెదక్ పట్టణంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ కరాటే పోటీల్లో నార్సింగి, చేగుంట మండలాలకు చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించారు. జప్తి శివనూర్, నర్సంపల్లి, నార్సింగి, చేగుంట కేజీవీబీ పాఠశాలలకు చెందిన సుమారు 29 మంది విద్యార్థులు కరాటే మాస్టర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొన్నారు. నర్సంపల్లి పాఠశాల విద్యార్థులు 1 గోల్డ్, 3సిల్వర్, జప్తిశివనూర్ పాఠశాల విద్యార్థులు 2గోల్డ్, 1 సిల్వర్, నార్సింగి విద్యార్థులు 3 సిల్వర్, చేగుంట కేజీవీబీకి చెందిన 19 మంది విద్యార్థులు 12 గోల్డ్, 7 సిల్వర్ పథకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సుధీర్‌రెడ్డి, విఠల్, సంతోష్‌రాణి, అన్నపూర్ణ, మురళీమోహన్, శ్రీధర్‌రెడ్డి, పూర్ణచందర్‌రావు, శ్రీవాణి, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

పతకాలు సాధించిన గురుకుల, కేజీవీబీ విద్యార్థులు

మెదక్ పట్టణంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీ ల్లో రామాయంపేట ప్రభుత్వ గురుకుల పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులు, కోమటిపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్లు కుందెన నాగరాజు, రొయ్యల హరిప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గావు సురేందర్ తెలిపారు. పతకాలను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సరళాదేవి, అనురాధ, అధ్యాపకులు తదితరులు సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ విజయకుమారి, పీఈటీ సునీత ఉన్నారు.

బహుమతులు, ప్రశంసాపత్రాలతో రామాయంపేట గురుకుల పాఠశాల విద్యార్థులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూపు (A.P., న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

LOST

★ I, Ananthapuram Raghuvaran, S/o. A. Anjaneyulu, R/o. Q.No. 343/E, BHEL Town Ship, R.C. Puram (M), Sangareddy (Dist), T.S-502032. I lost my original Sale Deed document bearing No. 2370/1994, Dated: 30.09.1994, SRO Narsapur, while travelling by bike from Patancheru to Indresham on 10.11.2023.
If anybody found pls. Cont: 9032935555
NT-299269

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.